క్లుప్తంగా

అర్హత ఉన్న రైతులకు రుణాలు

శావల్యాపురం: ఖరీఫ్ సీజనుకు అర్హత కల్గియున్న రైతులకు రుణాలు మంజూరు చేస్తామని శావల్యాపురం సొసైటీ అధ్యక్షులు గడుపూడి విశ్వనాథం తెలిపారు. గురువారం స్థానిక సొసైటీ కార్యాలయంలో విశ్వనాథం మాట్లాడుతూ శావల్యాపురం సొసైటీ పరిధిలోని 14 గ్రామాలకు చెందిన రైతులకు ఎరువులు పురుగు మందుల కొరత లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు ఖరీఫ్ రబీ సీజనుల్లో అందుబాటులో ఉండేలా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేస్తామన్నారు. ఈ ఖరీఫ్ సీజనుకు వ్యవసాయ అనుబంధ రుణాలు రూ.5 కోట్ల మేర ఇవ్వటానికి లక్ష్యంగా ఎంచుకున్నట్లు తెలిపారు. అలాగే రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించి సొసైటీ అభ్యున్నతికి పాటుపడాలన్నారు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లిఖార్జునరావులు సహకారంతో శావల్యాపురం సొసైటీ అభివృద్ధి పథంలో పయనించటానికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

బెల్ట్ షాపులపై ఉక్కుపాదం మోపుతాం

శావల్యాపురం: గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే అటువంటి వారిపై ఉక్కుపాదం మోపుతామని వినుకొండ ఎక్సైజ్ సీఐ దేవర శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని చినకంచర్ల, ముండ్రువారిపాలెం గ్రామాల్లో ఎక్సైజ్ పోలీసులు విస్తృత దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ దేవర శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు మేరకు గ్రామాల్లో అనాధికారికంగా మద్యం సీసాలను అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. చినకంచర్ల, ముండ్రువారిపాలెం గ్రామాలకు చెందిన గుర్రం వెంకటేశ్వర్లు, యోగిరాముల ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్సై వినీల, ఎక్సైజ్ పోలీసులు ఉన్నారు.

రాష్ట్రంలో పాలన ఎమర్జెన్సీని తలపిస్తోంది

నరసరావుపేట రూరల్: రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తుందని ఎంఐఎం పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎస్కె మౌలాలి విమర్శించారు. సంక్షేమ హాస్టల్స్‌లో సమస్యలు ఉంటే పరిష్కరించాల్సింది పోయి ప్రజలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు హాస్టల్స్‌లోకి వెళ్లకూడదని రాష్ట్ర ప్రభుత్వం చీకటి జీవోను విడుదల చేయడం దురదృష్టకరమన్నారు. సంక్షేమ హాస్టల్స్‌లో సమస్యలు లేనప్పుడు చీకటి జీవో విడుదల చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. హాస్టల్స్‌లోని సమస్యలను కప్పిపుచ్చేందుకే ఈ జీవోను తీసుకు వచ్చిందన్నారు. విద్యాసంస్థలు, హాస్టల్స్‌లో సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సమస్యలు తీర్చాల్సిన ప్రభుత్వం ఎవరూ అటువైపు వెళ్లకూడదని ఆంక్షలు విధించడం ప్రభుత్వ చేతకాని తనాన్ని ప్రదర్శించడమే అవుతుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం చీకటి జోవోను రద్దు చేసి విద్యాసంస్థలు, హాస్టల్స్‌లో మౌళిక వసతులు కల్పించి, విద్యార్థులకు సంక్షేమానికి పనిచేయాలని సూచించారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ హాస్టల్స్‌లోని విద్యార్థులతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

సాగుకు సాగర్ జలాలు

శావల్యాపురం: సాగునీటికి సాగర్ జలాలు విడుదల చేసినట్లు లింగగుంట ఎన్నెస్పీ డీఈ జరుగుల విజయలక్ష్మి గురువారం తెలిపారు. సాగర్ జలాశయం నిండుకుండలా తలపిస్తోందని ప్రభుత్వ ఆదేశాలు మేరకు మండలంలోని గంటావారిపాలెం గ్రామ సమీపంలో ఉన్నటువంటి అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామన్నారు. సాగునీరు విడుదల ఆనందంలో రైతుల ఉంటే మరోవైపు నీటి సామర్థ్యం తగ్గించారని చివరిభూముల రైతులు ఆందోళన చెందుతున్నారు. మాగాణి భూములు కల్గిన రైతులు వరి నారుమడులు సాగుకు సిద్ధం అవుతున్నా సమయంలో సాగునీరు విడుదల సామర్థ్యం తగ్గించటంతో వరినారుమడులు ఎండిపోతున్నాయని వాపోతున్నారు. ఈ విషయమై డీఈ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా 55.55 కిలో మీటరు పరిధిలో రెండు వరుసల వంతెన నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో నీటిసామర్థ్యం తగ్గించినట్లు తెలిపారు. వంతెన నిర్మాణ పనులు ఆధారంగా ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు సాగర్ జలాలు విడుదల పెంపుదలకు చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా బంద్

నాదెండ్ల: మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆశాఖ డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. రెండోశనివారం సందర్భంగా గణపవరం ఫీడర్ పరిధిలోని గణపవరం, కొత్త బైపాసు రోడ్డు, కనపర్రు ఫీడర్లోని కనపర్రు, మైనంపాడు, సాతులూరు ఫీడర్‌లోని సాతులూరు గ్రామాలకు శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

యడ్లపాడు: రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. మండలంలోని తిమ్మాపురం జంక్షన్‌లో అదే గ్రామానికి చెందిన ఎం.రమేష్ రోడ్డు దాటుతుండగా చిలకలూరిపేట నుంచి గుంటూరు వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రమేష్ రోడ్డుపై పడి తీవ్రగాయాలైనా బైక్ నిలుపుదల చేయకుండా వెళ్లిపోయాడు. స్థానికులు గమనించి హైవే పెట్రోలింగ్ పోలీసులకు సమాచారం అందించారు. గాయాలైన రమేష్‌ను చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో వెల్లడి కావాల్సి ఉంది.



రహదారి మధ్యలో ఏర్పడిన గోయ్యి



చింతలపాలెం సమీపంలో దెబ్బతిన్న బీటీ రోడ్డు

ఇవి రహదారుణాలే!

- వల్లప్పచెరువు-అగ్రహారం రోడ్డులో భారీ గోతులు
- పలుచోట్ల దెబ్బతిన్న రింగ్‌రోడ్డు
- చినతురకపాలెం - గోనెపూడి రోడ్డులో బయటపడిన కంకరరాళ్లు

నరసరావుపేట రూరల్: మండలంలోని రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. నిత్యం వాహనాల రద్దీ ఉండే రోడ్డుల సైతం గోతులతో నిండిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రోడ్ల నిర్మాణాన్ని విస్మరించిందని ఎన్నికల సమయంలో ప్రచారం చేసి ప్రజలను మభ్యపెట్టిన కూటమి నాయకులు ఇప్పుడు అధ్వానంగా మారిన రోడ్ల గురించి మాత్రం మాట్లాడటం లేదు. గత సంక్రాంతికి రోడ్ల మరమ్మతులు పూర్తిచేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించినా మండలంలోని రోడ్లు పరిస్థితి మెరుగుపడలేదు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు చిన్న చిన్న గోతులు కాస్త గుంతలుగా మారి వాహనాదారులకు చుక్కలు చూపిస్తున్నాయి.



వల్లప్పచెరువు-కేఎం అగ్రహారం రోడ్డులో ఏర్పడిన గోతులు



రింగ్‌రోడ్డులో కంకరరాళ్లు బయటపడిన దృశ్యం

నరసరావుపేట పట్టణం నుంచి వల్లప్పచెరువు మీదగా మండలంలోని ఇసప్పాలెం, కేఎం అగ్రహారం, పమిడిపాడు, నకరికల్లు తురకపాలెం గ్రామాలకు వెళ్లే రహదారి దెబ్బతింది. పలు చోట్ల భారీ గోతులు ఏర్పడ్డాయి. దీంతోపాటు బీటీకి పగుళ్ల ఏర్పడి అనేక ప్రాంతాల్లో రోడ్డు పూర్తిగా దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. ఈ మార్గం నుంచి ద్విచక్ర వాహనాలతో పాటు స్కూల్ బస్‌లు, ప్రైవేటు వాహనాలు అధికంగా ప్రయాణిస్తుంటాయి. భారీ గోతుల కారణంగా రాత్రి వేళల్లో ప్రయాణించేందుకు వాహనదారులు భయపడుతున్నారు.

వర్షాలతో నీరు నిలిచిన సమయంలో వాహనదారులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు పట్టణంలో భారీ వాహనాల రాకపోకలను పోలీసులు నిషేధించారు. దీంతో చిలకలూరిపేట, గుంటూరు వైపు నుంచి పిడుగురాళ్ల వైపువెళ్లే వాహనాలు జొన్నలగడ్డ సమీపంలోని రింగ్‌రోడ్డు నుంచి ప్రయాణిస్తుంటాయి. జొన్నలగడ్డ నుంచి ఇస్సప్పాలెం వరకు 2.5 కిలోమీటర్ల రహదారిలో ప్రయాణించాలంటే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. ఈ రోడ్డులో అనేక చోట్లు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. పలు చోట్లు రోడ్డు కోతకు గురైంది. దెబ్బతిన్న ప్రాంతంలో మరమ్మత్తుల పేరుతో రెడీమిక్స్ వేసినా పరిస్థితి మెరుగుపడలేదు. వర్షాలకు రెడీమిక్స్ వేసిన చోట బురదమయంగా మారుతుంది. చినతురకపాలెం నుంచి గొనెపూడి రోడ్డు గోతులతో నిండిపోయింది. చినతురకపాలెం, చింతలపాలెం, గొనెపూడి గ్రామస్తులు ఈ రోడ్డును రాకపోకలకు ఉపయోగిస్తుంటారు. మూడు గ్రామాలకు చెందిన ద్విచక్రవాహనాలతో పాటు పదుల సంఖ్యలో ప్రైవేటు పాఠశాలల బస్సులు నిత్యం ఈ రోడ్డులో ప్రయాణిస్తుంటాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు కాలంలో ఈ రోడ్డులో కనీస మరమ్మతులు చేపట్టలేదు. పాలకులు స్పందించి రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బాబు మోసం గ్యారెంటీ

- చంద్రబాబు అదే పనిగా పెట్టుకున్నారు
- జిల్లా వైఎస్సార్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- మాచవరం, నల్లగార్లపాడు గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం



మాచవరంలో మాట్లాడుతున్న డాక్టర్ గోపిరెడ్డి



గోపిరెడ్డికి సమస్యలు తెలుపుకుంటున్న మహిళలు

రొంపిచర్ల: వాగ్దానాలు ఇచ్చి అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్ర ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు పనిగా పెట్టుకున్నాడని జిల్లా వైఎస్సార్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని మాచవరం, నల్లగార్లపాడు గ్రామాల్లో గురువారం నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్నదాత సుఖీభవ పేరుతో రాష్ట్రంలోని 7 లక్షల మంది రైతులకు మొండి చేయి చూపించారన్నారు. తల్లికి వందనం పథకాన్ని 80 లక్షల మంది విద్యార్థులకు ఇవ్వాల్సి ఉండగా 50 లక్షల మందికే ఇచ్చారన్నారు. పథకం వర్తించిన వారికి కూడా ఎకౌంట్‌లలో కొందరికి రూ.5 వేలు, రూ.9 వేలు వేసి మమ అనిపించారన్నారు. గ్రామాల్లో వేళాపాళా లేకుండా విద్యుత్ కోతలు విధిస్తూ ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. రైతులకు విత్తనాలు, యూరియా అందించటంలో పూర్తిగా విఫలమైందన్నారు. గ్రామానికి వచ్చిన గోపిరెడ్డికి మహిళలు, రైతులు తాము పడుతున్న ఇబ్బందులను చెప్పుకున్నారు. తల్లికి వందనం డబ్బులు పడలేదని, జీలుగలు, జనుములు విత్తనాలను తెలుగుదేశం పార్టీ వారికే పంపిణీ చేసుకుంటున్నారని తెలిపారు. రేషన్ బియ్యం కూడా సరిగా పంపిణీ చేయడంలేదని, అడిగితే బియ్యం లేవు, డబ్బులు ఇస్తామని డీలర్‌లు చెబుతున్నట్లు మహిళలు చెప్పారు. గ్యాస్ బండకు డబ్బులు పడటంలేదన్నారు. రెండు గ్రామాల్లో రైతులు, మహిళలు పడుతున్న ఇబ్బందులను డాక్టర్ గోపిరెడ్డికి విన్నవించుకున్నారు. ఈ సమస్యలన్ని తీరాలంటే జగన్‌మోహన్‌రెడ్డి పాలన రావాలన్నారు. గ్రామంలోని చర్చిల్లో ప్రార్థనలు చేశారు. వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి శిలావిగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ఈ కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షుడు కురుగుంట శ్రీనివాసరెడ్డి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అన్నెం పున్నారెడ్డి, గెల్లి చినకోటిరెడ్డి, పచ్చవ రవీంద్రబాబు, గుండాల వెంకటేష్, కోడూరి వెంకటేశ్వరరెడ్డి, పునగోటి వెంకట్రావు, పల్లెల మల్లిఖార్జనరెడ్డి, మోతుకూరి వెంకటేష్, పడాల హనిమిరెడ్డి, చపారపు సంజీవరెడ్డి, కల్లి ప్రతాప్‌రెడ్డి, పస్నీరు శ్రీనివాసరావు, వెంకటనారాయణ, గ్రామ నాయకులు ఏరువ శ్రీనివాసరెడ్డి, బెబ్బులి కోటిరెడ్డి, ఏసుపాదం, బాలకోటిరెడ్డి, గోవిందరెడ్డి, కోనారెడ్డి, వెంకటేశ్వరెడ్డి, రమణారెడ్డి, చంద్రారెడ్డి, పలువురు గ్రామనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబూ మోసాలను ఇంటింటికీ చేరవేస్తాం

- వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి
- 34వ వార్డులో బాబూష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

చిలకలూరిపేటటౌన్: చంద్రబాబు చేసిన మోసాలకు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరిస్తామని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి పేర్కొన్నారు. పట్టణంలోని సుగాలీకాలనీలో గురువారం బాబూ ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. 34వ వార్డు కౌన్సిలర్ వడితే కోట్యా నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో దరియావలి హాజరై మాట్లాడుతూ.. బాబు 40 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎన్నడూ నిజాలను మాట్లాడలేదన్నారు. గత ఎన్నికల సమయంలో కూడా సూపర్‌సిక్స్ పేరుతో హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా దగా చేశారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళలకు ప్రతినెలా ఆడబిడ్డ నిధి కింద ఇస్తామన్న రూ.1500 ఎందుకు ఇవ్వడంలేదో చెప్పాలన్నారు. ప్రతిసారీ నిరుద్యోగులను నమ్మించి మోసం చేయడం చంద్రబాబుకు అలవాటుగా మారిందన్నారు. 2024 ఎన్నికల మేనిఫెస్టోలో నిరుద్యోగ భృతి హామీ ఇచ్చి ఏడాదిన్నర కావస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇలా అన్ని వర్గాల ప్రజలను ఓట్ల కోసం నమ్మించి దగా చేశారన్నారు. అనంతరం క్యూర్ ఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ముందుగా స్థానికంగా ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సొంటి శీను, రంజిత్ (దమ్ము), నూన్నావత్ విష్ణునాయక్, వజ్రబాయి, రమావత్ మంగాబాయి, భూక్యా ప్రసాద్‌నాయక్, మెగావత్ బాలానాయక్, నరసింహ, మీసాల రవి, జక్రరయ్య, గాత్రం వీరాంజనేయులు, రమావత్ బాలకృష్ణానాయక్, బిట్ర నాగాంజనేయులు, బాణావత్ బాలమ్మబాయి, బాలూ నాయక్ పాల్గొన్నారు.

అందుబాటులోకి బహుళ ప్రయోజన గిడ్డంగులు



గిడ్డంగులను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఉమాదేవి

నూజెండ్ల: మండల రైతులకు బహుళ ప్రయోజన గిడ్డంగులు సౌకర్యం అందుబాటులోకి తీసుకురానున్నట్లు సొసైటీ అధ్యక్షులు బచ్చు అంజిరెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన నూజెండ్లలో 40 లక్షల రూపాయలు నిధులతో గత వైఎస్సార్ సీపీ పాలనలో గిడ్డంగులు నిర్మాణం చేపట్టారు. పాలనా పరమైన అనుమతుల రాక రెండు సంవత్సరాలుగా ప్రారంభానికి నోచుకోలేదు. ఉన్నతాధికారుల ఆదేశాలు రావటం, ఇటీవల ఎన్నికైన సొసైటీ అధ్యక్షులు చొరవ చూపటంతో రైతులకు గిడ్డంగి సేవలు అందుబాటులో రానున్నాయి. దీనిలో భాగంగా ఎంపీడీవో ఉమాదేవి, ఎంపీపీ మేడం జయరామిరెడ్డితో కలిసి సొసైటీ అధ్యక్షులు బచ్చు అంజిరెడ్డి గిడ్డంగిని గురువారం పరిశీలించారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా గిడ్డంగులను త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గిడ్డంగుల వద్దకు వాహనాలు వెళ్లాలంటే కాలువ మీద కల్వర్టు నిర్మాణం చేపట్టాల్సి ఉందని మండల నిధులు కేటాయించాలని ఎంపీడీవోని కోరారు. రానున్న వ్యవసాయ సీజన్‌లో ఎరువులను నిల్వ చేసి రైతులకు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. కల్వర్టు నిర్మాణానికి అంగీకరించిన ఎంపీడీవో ఉమాదేవి అంచనాలు తయారు చేయాలని ఎ.ఇ.అల్లాబక్షుని ఆదేశించారు. వారితో పాటు సొసైటీ సి.ఇ.వొ గంగినేని శ్రీనివాసరావు ఉన్నారు.

11న యడ్లపాడులో పోపూరి వర్ధంతి సభ



పోపూరి రామారావు (ఫైల్)

యడ్లపాడు: రైతు నాయకుడు పోపూరి రామారావు ఆరో వర్ధంతి సభ ఈ నెల 11వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం మండలకార్యదర్శి జరుగుల శంకరరావు, లింగారావుపాలెం శాఖా కార్యదర్శి ఆలోకం సుబ్బారావు, యడ్లపాడు శాఖా కార్యదర్శి బి.పీటర్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ యడ్లపాడులోని పీఆర్ విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు జరిగే ఈ వర్ధంతి సభకు రాష్ట్ర రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు, ప్రముఖ న్యాయవాది చెరుకూరి సత్యనారాయణ హాజరై స్మారకోపన్యాసం చేయనున్నట్లు వెల్లడించారు. ప్రత్తి, మిరప వంటి పంటల సాగు సమస్యలు, గిట్టుబాటు ధరల కోసం, సాగునీటి సమస్యలపై నాటి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేశారు. అంతేకాకుండా వ్యవసాయ కార్మికుల హక్కులు, నిరుపేదల సమస్యల పరిష్కారం కోసం విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. యడ్లపాడు కేంద్రంగా చేసుకుని చిలకలూరిపేట నియోజకవర్గంతో పాటు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని రైతాంగ సమస్యలపై పోపూరి రామారావు తన జీవితాన్ని అంకితం చేశారని వివరించారు. జిల్లా రైతు సంఘం అధ్యక్షుడిగా, మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు రైతు నాయకుడిగా ఆయన విశేష సేవలు అందించి రైతాంగంలో మంచి గుర్తింపు పొందారని తెలిపారు. ఆయన సేవలకు గుర్తుగా యడ్లపాడులో పీఆర్ విజ్ఞాన కేంద్రం స్థాపించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ వర్ధంతి సభకు రామారావు అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.


రాఖీ పండుగతో దేశభక్తిని చాటిన విద్యార్థులు



రాఖీలు కడుతున్న విద్యార్థులు

చిలకలూరిపేటటౌన్: రాఖీ పండుగ కేవలం తోబుట్టువుల అనుబంధానికి ప్రతీక మాత్రమే కాదని, దేశభక్తిని, ఐకమత్యాన్ని చాటిచెప్పే పండుగ అని సామాజిక కార్యకర్త లక్ష్మణ్‌జీ తెలిపారు. స్థానిక జీవీ ఐటీ పాఠశాలలో గురువారం నిర్వహించిన ముందస్తు రక్షాబంధన్ వేడుకల్లో ఘనంగా నిర్వహించారు. నువ్వు నాకు రక్ష, నేను నీకు రక్ష, మనమిద్దరం దేశానికి రక్ష అనే నినాదం స్వాతంత్ర్య పోరాట సమయంలో ప్రజలను ఒకతాటిపై నడిపిందని ఆయన గుర్తుచేశారు. అలెగ్జాండర్ భార్య రాఖీ పంపడంతో, యుద్ధంలో ఓడిపోయినా పురుషోత్తముడు అలెగ్జాండర్‌ను చంపకుండా వదిలేశాడని, రక్షాబంధన్‌కు అంతటి ప్రాముఖ్యత ఉందని తెలిపారు. ఇలాంటి పండుగలు భారతదేశంలోని భిన్నత్వంలో ఏకత్వంను ప్రపంచానికి చాటిచెబుతాయని ఆయన అన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ దేవులపల్లి ఫణికుమార్ మాట్లాడుతూ ఒకప్పుడు అఖండ భారత్‌గా ఉన్న దేశం విదేశీ దురాక్రమణల వల్ల ముక్కలైందని, కానీ పొరుగు దేశాలు ఇప్పటికీ మనల్ని చూసి ఓర్వలేక కయ్యానికి కాలుదువ్వుతున్నాయని అన్నారు. ఇలాంటి సమయంలో ప్రతి భారతీయుడు దేశానికి రక్షణగా ఉండాలని పిలుపునిచ్చారు. ధర్మ రక్షణే దేశ రక్షణగా భావించి విలువలతో కూడిన భారత్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై ఉండాలని కోరారు. అనంతరం విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకొని, మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో స్కూల్‌డైరెక్టర్ పారేపల్లి ఉదయ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అబాకస్‌తో గణితం ఎంతో సులభం



అబాకస్ దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: స్థానిక వేద పాఠశాలలో అంతర్జాతీయ అబాకస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అబాకస్ సహాయంతో క్లిష్టమైన గణిత సమస్యలను వేగంగా పరిష్కరించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పాఠశాల డైరెక్టర్ శ్రీగిరి పెర్సీ స్వరూప మాట్లాడుతూ అబాకస్ విద్యార్థులలో అంతర్‌దృష్టి, ఊహాశక్తి, ఏకాగ్రతను పెంచుతుందని చెప్పారు. ఇది గణిత అవగాహనను మెరుగుపరచడమే కాకుండా, పిల్లలలో నైపుణ్యాలను అభివృద్ధి చేస్తుందని తెలిపారు. అకాడమిక్ డైరెక్టర్ సత్యదీప్తి మాట్లాడుతూ అబాకస్ ద్వారా గణితం పట్ల ఆసక్తి పెరిగి, త్వరిత గతిన లెక్కలు చేయగలుగుతారని తెలిపారు. కంప్యూటర్లు, కాలిక్యులేటర్లు ఉన్నప్పటికీ అబాకస్ ప్రాముఖ్యత తగ్గలేదని, ఇది 6 నుంచి 14 సంవత్సరాల పిల్లలలో జ్ఞాపకశక్తిని మెరుగుపరచడానికి ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. ప్రిన్సిపాల్ డేనియల్ మాట్లాడుతూ అబాకస్ అనేది ఒక గణన సాధనమని, కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగాహారాలతో పాటు క్యూబిక్ డిగ్రీ వరకు మూలాలను కూడా లెక్కించగలదని తెలిపారు.

ముగిసిన తల్లిపాల వారోత్సవాలు



తల్లిపాల వారోత్సవాల ర్యాలీ చేస్తున్న సంతపేట వాసులు

యడ్లపాడు: తల్లిపాల వారోత్సవాలలు మండలంలో ముగిశాయి. మండలంలోని సంతపేట అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యకార్యకర్త బి.శ్రావణి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఒక సంపూర్ణ ఆహారం అని, దీనివల్ల బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతుందని తెలిపారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల బిడ్డకు మాత్రమే కాకుండా తల్లికి కూడా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, ముఖ్యంగా తల్లిపాల ద్వారా బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. డబ్బా పాలవల్ల కలిగే నష్టాలను కూడా ఆమె తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సీహెచ్ శ్రీదేవి, బి పద్మజ, ఎస్‌కే అయుషాబేగం, పి.నాగజ్యోతి, గ్రామ పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అప్పాపురంలో..

నాదెండ్ల: మండలంలోని అప్పాపురం గ్రామంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతపై గ్రామంలోని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అప్పుడు జన్మించిన శిశువుకు ముర్రుపాలు తాగించడం వలన వారిలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పసుమర్రులో....

చిలకలూరిపేటటౌన్: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పసుమర్రు గ్రామంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆగస్టు 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు జరిగిన ఈ వారోత్సవాలలో చివరి రోజున, సూపర్‌వైజర్ కె ప్రసన్న కుమారి గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. బిడ్డ పుట్టిన మొదటి గంటలోపు తల్లిపాలు ఇవ్వడం వల్ల శిశువుకు కొన్ని వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని ప్రసన్నకుమారి తెలిపారు. తల్లిపాలు బిడ్డకు ఒక సంపూర్ణ ఆహారం అని, దీనివల్ల బిడ్డ శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఎదుగుతుందని వివరించారు. ఆరోగ్య కార్యకర్త పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

కూటమి దాడిపై బీసీ నాయకుల ఖండన

వినుకొండ: కడప జిల్లా పులివెందులలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ పై జరిగిన దాడిని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బీసీ నాయకులు తీవ్రంగా ఖండించారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీసీ నాయకులు మాట్లాడుతూ పులివెందులలో జెడ్పీటీసీ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా వెళుతున్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ గారిపై జరిగిన దాడి ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టన్నారు.ఒక జడ్పీటిసి ఎన్నిక గెలవలేక ఓడిపోతామని భయంతో ఒకరిపై వందల మంది చుట్టుముట్టి దాడి చేయడం దుర్మార్గమన్నారు. చంద్రాబబు లోకేష్ రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో పట్టణ బీసీ సంఘం అధ్యక్షులు గుంజి వాసు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్ ఈపూరు వైసిపి కన్వీనర్ కొండావర్జు నాగేశ్వరరావు, అంగలూరు సొసైటీ అధ్యక్షులు జానీ మాజీ ఎంపీటీసీ ఒంటేరు ఆంజనేయులు తోపాటు పలువురు నియోజకవర్గ బీసీ నాయకులు పాల్గొన్నారు.

జావెలిన్ డేలో అఖిల్‌కు బంగారు పతకం



చిలకలూరిపేటటౌన్: జావెలిన్ త్రో విభాగంలో పట్టణంలోని ఏఎంజీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి హరివెంకటఅఖిల్ బంగారు పతకం సాధించాడు. గురువారం జాతీయ జావెలిన్ డే సందర్భంగా గుంటూరులోని బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు నిర్వహించిన పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఏఎంజీలో తొమ్మిదో తరగతి చదువుతున్న అఖిల్ అండర్-16 విభాగంలో పాల్గొని, 37 మీటర్ల దూరం జావెలిన్ విసిరి ఈ ఘనత సాధించాడు. అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి జి.శివప్రసాద్ విజేత హరి వెంకట అఖిల్‌కు బంగారు పతకాన్ని అందజేశారు. అఖిల్‌ను ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ అరుణ్ కుమార్ కంటి మహంతి, హైస్కూల్ హెచ్ఎం కె.కృపాదానం, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, రాజేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

12న మద్దిరాలలో మెగా జాబ్ మేళా

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చిలకలూరిపేట శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచనల మేరకు నిరుద్యోగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎస్ఎస్‌డీసీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. చిలకలూరిపేట మండలం మద్దిరాల గ్రామంలోని సాధినేని చౌదరయ్య కళాశాల ఆవరణలో ఆగస్టు 12వ తేదీ మంగళవారం జరిగే ఈ జాబ్ మేళాలో 20కి పైగా జాతీయస్థాయి సంస్థలు ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. వాటిలో టెక్ మహీంద్రా, ఎమ్.ఎస్. ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా, మాస్టర్ మైండ్స్, ముత్తూట్ మినీ ఫైనాన్షియర్స్, మెడ్‌ప్లస్, ఇన్నోవ్, కాప్పన్ సర్వీసెస్ లిమిటెడ్, ఎపెక్స్ సొల్యూషన్స్, డైకిన్ వంటి ప్రముఖ సంస్థలు ఉన్నాయని వారు వివరించారు. ఈ జాబ్‌మేళాకు యువత అధిక సంఖ్యలో హాజరై ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందాలని ఆకాంక్షించారు. జాబ్‌మేళకు హాజరయ్యే అభ్యర్థులు మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు: 91005 66581, 91602 00652, 77029 21219 సంప్రదించాలన్నారు.